
సాక్షి
నిర్మల్
గురువారం ׀ 16 ׀ నవంబర్ ׀ 2023



పరోక్షంగా బరిలో..

ఉమ్మడి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు మహిళా నేతలకు పార్టీ టికెట్లు దక్క లేదు. దీంతో పార్టీ కండువాలు మార్చి పరోక్షం గా ఎన్నికల బరిలో నిలిచారు. 10లో ▸



రైతులకు కష్టాలు తప్పేనా?

గత సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వసతులు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ సీజన్‌లోనైనా అధికారులు పూర్తి వసతులు కల్పించాలని కోరుతున్నారు. 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 19.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

ఒక్క ఛాన్స్ ఇవ్వండి



సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి శ్రీహరిరావు, వేదికపై పార్టీ నాయకులు

- శ్రీహరిని గెలిపిస్తే నిర్మల్ అభివృద్ధి
- ఇన్నేళ్లు దోచుకున్న అల్లోల, ఏలేటి
- డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వమే..
- నిర్మల్ సభలో పీసీసీ చీఫ్ రేవంత్
- సభ సక్సెస్.. కాంగ్రెస్‌లో ఫుల్‌జోష్



సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

నిర్మల్/నిర్మల్‌చైన్‌గేట్: 'ఐదేళ్లపాటు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పదేళ్లుగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాలకులుగా ఉన్నారు. వీరిద్దరూ నిర్మల్ నియోజకవర్గానికి ఏం చేశారు..? అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను వదిలి తెలంగాణ కోసం శ్రీహరిరావు ఉద్యమించారు. తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేశారు. ఒక్కసారి ఆలోచించండి. ఈసారి కూచాడి శ్రీహరిరావుకు అవకాశం ఇవ్వండి..' అంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ రోడ్డులో పాతక్రషర్ ఎదుట గల మైదానంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల సభలో పాల్గొన్నారు. బోథ్ సభ పూర్తిచేసుకుని హెలీక్యాప్టర్‌లో చేరుకున్న ఆయనకు శ్రీహరిరావుతోపాటు నాయకులు అర్జుమంద్‌అలీ, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు.

ఈ నేల, ఈ గాలి..

'తమ స్వేచ్ఛకోసం తెల్లదొరలపై ఈ గడ్డమీద రాంజీగోండు, వెయ్యిమంది వీరులు పోరాటం చేసింద్రు. ఇది వీరుల గడ్డ. ఈ నేల, ఈ గాలి పోరాటం నేర్పింది. స్వేచ్ఛ, స్వతంత్రం కోసం పోరాటం చేసింది. స్వతంత్రాన్ని సాధించింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు ఊపిరిపోసింది. ఇక్కడి ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేలా చేసింది..' అంటూ రేవంత్‌రెడ్డి రాంజీగోండు సహా వెయ్యిమంది వీరులను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను వదిలి తెలంగాణ ఉద్యమం కోసం ఆనాడు బయటకు వచ్చిన శ్రీహరిరావు, ఇప్పుడు ఈ ప్రాంత అభివృద్ధి కోసం మళ్లీ అధికారంలో ఉన్న పార్టీని వదిలి కాంగ్రెస్‌లోకి వచ్చారన్నారు. రాంజీగోండు స్ఫూర్తితో శ్రీహరిరావు పోరాడుతున్నారని చెప్పారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

నిర్మల్‌ను వరుసగా పాలించిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఏం చేశారో ప్రజలు ప్రశ్నించుకోవాలని రేవంత్ కోరారు. దొరల చేతిలో ఆధిపత్యం ఉందని, ప్రజల కష్టాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని, అరచేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకిస్తున్నారని ఎద్దేవా చేశారు. అర్హులైన పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వలేని ఐకేరెడ్డి ఉంటే ఎంత.. పోతే ఎంత.. అని అన్నారు. తాము ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఊళ్లల్లో ఓట్లు అడుగుతామని, దమ్ముంటే ఇంద్రకరణ్‌రెడ్డి డబుల్ బెడ్రూంలు కట్టించిన ఊళ్లల్లో మాత్రమే ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. అక్కడ మామాఅల్లుళ్లు మేడిగడ్డ, అన్నారంలను కుంగేలే చేశారని, ఇక్కడ ఇంద్రజాలికుడు ఇంద్రకరణ్‌రెడ్డి, ఆయన తమ్ముడు కలిసి కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. బావ కళ్లల్లో ఆనందం చూడటానికి మరిది ఉన్నట్లు మహేశ్వర్‌రెడ్డి పనిచేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుడిగా ప్రజల కోసం పోరాడుతున్న శ్రీహరిరావుకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు.



మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

కొడంగల్‌తో సమానంగా చేస్తా..

డిసెంబర్ 9న తెలంగాణలో ఏర్పడేది కాంగ్రెస్ సర్కారేనని, తన కొడంగల్ నియోజకవర్గంతో సమానంగా నిర్మల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తానే తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దొడ్డిదారిన జీవోలు తెచ్చి నిర్మల్‌లో మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నారని, పేదల భూములను కొల్లగొట్టే ప్లాన్‌చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ఈ మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.

బావాబామ్మర్ది మోసం చేస్తున్నరు

– కూచాడి శ్రీహరిరావు

నిర్మల్ నియోజకవర్గంలో ప్రతీవిషయంలో 'నువ్వు కొట్టినట్లు చేయి.. నేను ఏడ్చినట్లు చేస్తా..' అన్న తరహాలో బావాబామ్మర్ది ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఆరోపించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించిన ఆయన ఇలా మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల పథకంలో భాగమైన ప్యాకేజీ 27, హైలెవల్ కెనాల్ పనులను వీరిద్దరూ అడ్డుకున్నారని, పనులు నత్తనడకన సాగేలా చేశారని మండిపడ్డారు. దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య పచ్చని పంటపొలాల్లోనూ వీరిద్దరూ కలిసే ఇథనాల్ ఫ్యాక్టరీ పేరిట చిచ్చుపెట్టారని ఆరోపించారు. మాస్టర్‌ప్లాన్ అమలుకు మంత్రి దొడ్డిదారిన జీవో 220 తీసుకువచ్చారని ఆరోపించారు. మాస్టర్‌ప్లాన్‌పై నెలలపాటు పట్టించుకోని మహేశ్వర్‌రెడ్డి ఎన్నికల ముందు దీక్ష అంటూ డ్రామా చేశాడని ఆరోపించారు. మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికుల పోస్టులు అమ్ముకునే స్థాయికి బీఆర్‌ఎస్ పాలకులు దిగజారారని దుయ్యబట్టారు. బావాబామ్మర్ది పీడ వదిలేలా నిర్మల్ నియోజకవర్గ ఓటర్లు తీర్పునివ్వాలని కోరారు.

సభ సక్సెస్.. హస్తంలో జోష్

ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి సభ రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. నేతలు వేసిన లెక్కలకు తగ్గట్లుగా భారీగా జనసమీకరణ జరగడం, సభాప్రాంగణం నిండటంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి. శ్రీహరిరావును గెలిపించాలని, ఇతర నేతలకూ సముచితస్థానం కల్పిస్తామని రేవంత్ హామీ ఇవ్వడంతో ఆయా నేతల అనుచరుల నుంచి భారీ స్పందన వచ్చింది. బోథ్ నుంచి మధ్యాహ్నం 2.48కి నిర్మల్‌కు చేరుకున్న రేవంత్‌రెడ్డి 3.34గంటల వరకు మాట్లాడారు. సభలో కేంద్ర మాజీమంత్రి బలరాం నాయక్, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్, నేతలు మల్లారెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అర్జుమంద్‌అలీ, రాజేశ్వర్, దుర్గాభవానీ, చిన్ను, జునైద్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆ నేతలకు సముచితస్థానం

ఎమ్మెల్యే టికెట్ ఆశించి, సీటు రాకున్నా పార్టీ కోసం పనిచేస్తున్న నేతలకు సముచిత స్థానాన్ని ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నిర్మల్ నియోజకవర్గానికి చెందిన అర్జుమంద్‌అలీ, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఖానాపూర్‌కు చెందిన చారులత రాథోడ్‌కు అండగా ఉండే జిమ్మేదారి తనదేనని పేర్కొన్నారు.

ఉచితాలు వద్దు.. ఉపాధే ముద్దు

జిల్లాలో వయస్సులవారీగా ఓటర్ల వివరాలిలా..

వయస్సు	నిర్మల్	ముథోల్	ఖానాపూర్
18–19	10,076	8,941	7,868
20–29	55,034	56,611	52,442
30–39	66,763	68,805	63,161
40–49	49,798	46,522	41,211
50–59	36,509	33,182	28,519
60–69	21,502	20,750	17,032
70–79	10,507	10,973	7,870
80–ఆపైన	3,120	3,770	2,423
మొత్తం	2,53,309	2,49,554	2,20,526



- ప్రజలను సోమరులను చేసే పథకాలొద్దు
- సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి
- అందుబాటులో ఉండేవారికే ఓటెయ్యాలి
- 'సాక్షి' ఎదుట గళం వినిపించిన యువత

భైంసాటౌన్: తన అద్భుత ప్రసంగంతో స్వామి వివేకానంద పాశ్చాత్యుల హృదయాలను చూరగొన్న భారతీయ తత్వవేత్త, గొప్ప మేధావి. భవిష్యత్ తరాలకు ఆయన ఓ మార్గదర్శి. ఆయన సందేశాలు యువత హృదయాన్ని సూటిగా తాకుతాయి. యువత తలచుకుంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని అన్నారాయన. స్వామి వివేకానంద యువతకు ఎన్నో స్ఫూర్తివంతమైన సందేశాలిచ్చారు. 'లేవండి.. మేల్కొండి.. గమ్యం చేరే వరకూ విశ్రమించకండి.. లేవండి.. మేల్కొండి.. మిమ్మల్ని మీరు మేల్కొల్పుకుని ఇతరులను మేల్కొల్పండి.. ఇకపై నిద్రించకండి.. మీరు మరణించేలోపే జీవిత పరమావధిని సాధించండి.. లేవండి.. మేల్కొండి.. గమ్యం చేరేవరకూ ఎక్కడా నిలవకండి.. బలమే జీవితం, బలహీనతే మరణం.. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనసులో ఉన్న యువత ఈ దేశానికి అవసరం'.. అని స్వామి వివేకానంద కోరుకున్నారు. అలాంటి యువత ఓటుహక్కుపై వారి అభిప్రాయాలు 'సాక్షి'తో పంచుకున్నారు. ఉచితాల పేరుతో ప్రజలను సోమరులను చేసే పథకాలు అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేవారినే ఎన్నుకుంటామని చెబుతున్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే స్వయం సమృద్ధి సాధిస్తామని, తద్వారా మరికొంతమందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంటున్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడే కావాలని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేలా చూడాలని కోరుతున్నారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకుంటామని వివరించారు.

నిస్వార్థపరులకే మా ఓటు



నిర్మల్ చైన్‌గేట్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవరు మంచివారు? గెలిచాక అభివృద్ధి చేస్తారా? లేదా? అనే విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజాసమస్యలు పరిష్కరించగలిగే అభ్యర్థినే ఎన్నుకోవాలి. డబ్బుకు ఆశపడి ఓటు అమ్ముకోవద్దు. ప్రలోభాలకు లొంగవద్దు. నిస్వార్థపరులకే ఓటు వేద్దాం. అప్పుడే మంచి నాయకులు ఎన్నికవుతారు.

– టీ విశాల్‌రాజ్, ఎంబీబీఎస్ ఫస్టియర్, నిర్మల్

అర్హులకే వర్తింపజేయాలి



నేతలు సాధ్యమయ్యే హామీలే ఇవ్వాలి. వాటి అమలుకు కట్టుబడి ఉండాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వం నోటిఫికేషన్లు వెలువరించే సమయంలో న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. తద్వారా ఉద్యోగ నియామకాలు సక్రమంగా జరిగేలా చూడాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే వర్తింపజేయాలి.

– కే చంద్రకాంత్, బీఎస్సీ బీఈడీ, భైంసా

సోమరులను చేసే పథకాలొద్దు



యువత ఓటు హక్కు వినియోగించుకోవడంతోపాటు ఓటు ప్రాధాన్యతపై తోటివారికి అవగాహన కల్పించాలి. ఓటు వేయడం ద్వారానే అభివృద్ధిపై, సమస్యలపై ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు పొందగలుగుతారు. యువతకు సరైన ఉపాధి కల్పిస్తే ఉచిత పథకాల అవసరం ఉండదు. ప్రజలను సోమరులను చేసే పథకాల అమలును ప్రభుత్వాలు మానుకోవాలి.

– యోగేశ్, యువకుడు, భైంసా

నిజాయతీపరులకే పట్టం కట్టాలి



రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పాలకుల విధానాలుండాలి. ఉచితాల పేరుతో ప్రజలను సోమరులను చేసే పథకాలు ప్రవేశపెట్టవద్దు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించాలి. అభివృద్ధి చేయకుంటే ప్రశ్నించే వారి గొంతు నొక్కేలా ఉన్న చట్టాలను సవరించాలి. ప్రజలు కూడా నిజాయతీగా ఉన్నవారికే పట్టం కట్టాలి.

– జీ వెంకటేశ్, ఖానాపూర్

ప్రలోభ పెట్టే ప్రచారాలొద్దు



ఎన్నికల ప్రచారంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ వీధుల్లో సభలు నిర్వహించడం నిలిపివేయాలి. టీవీలు, కరపత్రాల ద్వారానే ప్రచారానికి వీలు కల్పించాలి. ఇదే పద్ధతిలో మేనిఫెస్టోలు ప్రకటించాలి. దీంతో ప్రచారం పేరుతో నేరుగా ఓటర్లను కలవడం, వారిని ప్రలోభపెట్టడం, బెదిరింపులకు పాల్పడడం లాంటి చర్యలను అడ్డుకోవచ్చు.

– గోస్కుల సతీశ్, ఖానాపూర్

నియామకాలు పక్కాగా చేపట్టాలి



నిర్మల్ చైన్‌గేట్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది నిరుద్యోగులు రేయింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. పేపర్ లీకేజీలు, వాయిదాల కారణంగా ఏళ్లుగా కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పరీక్షల నిర్వహణ పక్కాగా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. బాధితుల పక్షాన నిలబడే నాయకులే కావాలి. ఈ వ్యవస్థ మార్చాలి. – చెన్న రాహుల్, డిగ్రీ విద్యార్థి, నిర్మల్

ఉపాధి అవకాశాలు పెంచాలి



నిర్మల్ చైన్‌గేట్: ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. నిరుద్యోగ యువతకు తగిన రీతిలో ఉద్యోగాలిచ్చే కంపెనీల స్థాపనపై దృష్టి సారించాలి. తద్వారా నిరుద్యోగ సమస్యను సమూలంగా నిర్మూలించాలి.

– ఆడెపు ప్రణయ్, బీటెక్ తృతీయ, నిర్మల్

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా ఎన్నికలాధికారి ఆశిష్ సాంగ్వాన్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. బారికేడ్లు, పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. భద్రతాపరమైన అంశాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్, ఆర్‌అండ్‌బీ అధికారి అశోక్, సుదర్శన్, సిబ్బంది ఉన్నారు.

ముథోల్ నామినేషన్ కేంద్రం పరిశీలన

ముథోల్: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బుధవారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవిరంజన్ కుమార్ విక్రం పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 1,630 దరఖాస్తులు

భైంసాటౌన్: ఎన్నికల విధులు నిర్వర్తించనున్న 1,630 మంది ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం దరఖాస్తు గడువు ముగిసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇంటి నుంచి ఓటు వేసేందుకుగాను దివ్యాంగులు, 80 ఏళ్లపైబడిన వృద్ధులు 224 దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు.

అసెంబ్లీ బరిలో 38 మంది

- ముగిసిన ఉపసంహరణ గడువు
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

నిర్మల్‌చైన్‌గేట్/భైంసా/ముథోల్: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల ఉపసంహరణ చివరిరోజైన బుధవారం తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. 38 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నిర్మల్ నియోజకవర్గంలో 13 మంది, ముథోల్ నియోజకవర్గంలో 14 మంది, ఖానాపూర్ నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఉపసంహరణలు ఇలా..

నిర్మల్ నియోజకవర్గం నుంచి ముస్కు సతీశ్‌రెడ్డి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ముథోల్ నియోజకవర్గానికి నామినేషన్ వేసినవారిలో నల్ల రవికుమార్, మహ్మద్ హుస్సేన్, పత్తిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, బెజ్జంకి ముత్యంరెడ్డి, పీ ప్రమోద్‌రెడ్డి, బుజిగే పెద్దోల్ల వీరేశం పోటీ నుంచి విత్‌డ్రా అయ్యారు. ఖానాపూర్ బరి నుంచి చౌహాన్ సేవాదాస్, జాదవ్ రవికిరణ్ తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

అభ్యర్థులకు కేటాయించిన గుర్తులివే..

ముథోల్ నియోజకవర్గంలో బరిలో నిలిచినవారికి అధికారులు గుర్తులు కేటాయించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డికి కారు గుర్తు, కాంగ్రెస్ అభ్యర్థి భోస్లే నారాయణ్‌రావుపటేల్‌కు చేయి, బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపాటిల్‌కు కమలం, బీఎస్పీ అభ్యర్థి సర్దార్ వినోద్‌కుమార్‌కు ఏనుగు, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి కాసరం రాజుకు బ్యాటరీ టార్చ్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థి గోరేకర్ విజయ్‌కు ట్రంపెట్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి దేవిదాస్ అసుడేకు గ్యాస్ సిలిండర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి బద్ధం భోజారెడ్డికి సింహం గుర్తు కేటాయించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. అలాగే స్వతంత్ర్య అభ్యర్థులు ఎలుగుదర్ ప్రవీణ్‌కు సబ్బుడబ్బా, జాదవ్ దత్తురాంకు కెమెరా, జాదవ్ దేవిదాస్‌కు ఎయిర్ కండిషనర్, పోతరాజు సుధాకర్‌కు బేబీవాకర్, మన్‌మోహన్ జాదవ్‌కు చపాతి రోలర్, సంజూ హెంలేకు రోడ్డు రోలర్ గుర్తు కేటాయించినట్లు పేర్కొన్నారు.

నిర్మల్ నియోజకవర్గ బరిలో 13 మంది		ముథోల్ నియోజకవర్గ బరిలో 14 మంది		ఖానాపూర్ నియోజకవర్గ బరిలో 11 మంది	
పేరు	పార్టీ	పేరు	పార్టీ	పేరు	పార్టీ
అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి	బీఆర్‌ఎస్	గడ్డిగారి విఠల్‌రెడ్డి	బీఆర్‌ఎస్	భూక్యా జాన్సన్ నాయక్	బీఆర్‌ఎస్
ఏలేటి మహేశ్వర్‌రెడ్డి	బీజేపీ	భోస్లే నారాయణరావుపటేల్	కాంగ్రెస్	రమేశ్ రాథోడ్	బీజేపీ
డీ జగన్‌మోహన్	బీఎస్పీ	రామారావు పటేల్ పవార్	బీజేపీ	వెడ్మ బొజ్జు	కాంగ్రెస్
కే శ్రీహరిరావు	కాంగ్రెస్	వినోద్‌కుమార్ సర్దార్	బీఎస్పీ	బన్సీలాల్ రాథోడ్	బీఎస్పీ
గొర్రె లింగన్న	బీఎంపీ	కాసారం రాజు	ధర్మ సమాజ్ పార్టీ	ఆశారెడ్డి బొంత	గొండ్వన గణతంత్ర పార్టీ
పరికిపండ్ల స్వదేశ్	ఏఐఎఫ్‌బీ	గోరేకర్ విజయ్	ఇండియా ప్రజాబంధు పార్టీ	కుత్తటి విజయ	ప్యారమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
మంతెన ఇంద్రకరణ్‌రెడ్డి	అలియాన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్	దేవిదాస్ హాసడే	రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా	జాదవ్ ప్రభాస్	ధర్మసమాజ్ పార్టీ
రవీందర్ రామగిరి	డీఎస్పీ	బద్దం భోజారెడ్డి	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్	పెందూర్ ప్రియాంక	కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా
ఖాజా నహీమొద్దీన్ మహ్మద్	స్వతంత్ర	ఏలుగుదార్ ప్రవీణ్	స్వతంత్ర	ఆత్రం రవీందర్	స్వతంత్ర
దేవ్వళ్ల రాజు	స్వతంత్ర	జాదవ్ దత్తరాం	స్వతంత్ర	నేతావత్ రాజేందర్	స్వతంత్ర
బుర్కా రాజేందర్	స్వతంత్ర	జాదవ్ దేవిదాస్	స్వతంత్ర	మోహన్	స్వతంత్ర
మల్లేశ్	స్వతంత్ర	పోతరాజు సుధాకర్	స్వతంత్ర		
సుదర్శన్	స్వతంత్ర	మన్‌మోహన్ జాదవ్	స్వతంత్ర		
		సంజూ హెంలే	స్వతంత్ర		



1. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
2. కూచాడి శ్రీహరిరావు (కాంగ్రెస్)
3. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ)



1. గడ్డిగారి విఠల్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
2. భోస్లే నారాయణరావుపటేల్ (కాంగ్రెస్)
3. పవార్ రామారావుపటేల్ (బీజేపీ)



1. భూక్యా జాన్సన్‌నాయక్ (బీఆర్‌ఎస్)
2. వెడ్మ బొజ్జుపటేల్ (కాంగ్రెస్)
3. రమేశ్ రాథోడ్ (బీజేపీ)

జిల్లా ఓటర్లు.. 7,24,319

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికల సమరంలో ఓటుహక్కు వినియోగించుకునే ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 7,24,319 మంది ఓటర్లున్నారు. గతనెల 10న ప్రకటించిన జాబితాలో మొత్తం 7,11,190మంది ఓటర్లున్నారు. తాజాగా ప్రకటించిన ఫైనల్ జాబితా ప్రకారం జిల్లాలో మళ్లీ ఓటర్లు పెరిగారు. దాదాపు నెల వ్యవధిలోనే 13,129 ఓటర్లు పెరిగారు. జిల్లా అధికారులతోపాటు పార్టీలు, పలుసంస్థలు, స్వీప్ అధికారులు చేసిన కృషి ఫలితంగా ఈ ఓటర్ల సంఖ్య పెరిగింది.

ఫైనల్ జాబితాలోని జిల్లా ఓటర్లు

పురుషులు:	3,50,509
మహిళలు:	3,72,829
థర్డ్‌జెండర్:	51
సర్వీస్‌ఓటర్లు: (పురుష–922, మహిళ–8)	930
మొత్తం ఓటర్లు:	7,24,319

ఘనంగా చిలుకలయ్య జాతర

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో చిలుకలయ్య దేవుడి కల్యాణ మహోత్సవ జాతరను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు ఆలయం వద్ద భక్తులు అగ్నిగుండాలు దాటుతూ మొక్కులు చెల్లించుకున్నారు. చిలుకలయ్య కల్యాణ మహోత్సవానికి జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. మేకలు, కోళ్లు బలి ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు. జాతరలో వివిధ దుకాణాలు ఏర్పాటు చేయగా భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో పూజారులు అర్జన్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిగుండాలు దాటుతున్న పూజారులు, భక్తులు

క్లుప్తంగా

పేలిన ఆక్సిజన్ సిలిండర్..



బిల్డింగ్‌పై కాలిపోతున్న కట్టెలు

నిర్మల్‌టౌన్: బిల్డింగ్ పైన ఆక్సిజన్ సిలిండర్ పేలిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బస్టాండ్ వెనకాల గల ఖాళీ బిల్డింగ్ పైన ఉన్న ఆక్సిజన్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో ఆ బిల్డింగ్ పైన ఉన్న కట్టెలు కాలిపోయాయి. వెంటనే చుట్టు పక్కల వారు అప్రమత్తమై మంటలు ఆర్పేశారు. ఆ బిల్డింగ్ నిరుపయోగంగా ఉండడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదు.

ఆటోలో మంటలు..



మంటలను ఆర్పుతున్న స్థానికులు..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాల సమీపంలో బుధవారం ఆకస్మాత్తుగా ఆటోలో మంటలు చెలరేగాయి. స్థానికుల వివరాల ప్రకారం... నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు ఓ ట్రాలీ ఆటోలో కట్టెలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో వెనుక నుంచి వచ్చేవారు గమనించిన ఆటోడ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే స్థానికుల సాయంతో మంటలు ఆర్పేశారు. ప్రమాదం నుంచి బయటపడడంతో డ్రైవర్ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

ఆదిలాబాద్‌టౌన్: బెల్టుషాపుల్లో విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో టూటౌన్ ఎస్సై రమణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్న సమయంలో సుందరయ్యనగర్‌కు చెందిన ఎల్మల అడెల్లు నాలుగు లీటర్ల మద్యం ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నాడు. దీంతో ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న బెల్లం పానకం


కడెం: రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎక్సైజ్ అధికారి జి.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నర్సాపూర్, పెద్దూర్‌తండాలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 25లీటర్ల గుడుంబా, 2600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఇందులో టాస్క్ ఫోర్స్ సీఐ రంగస్వామి, ఆదిలాబాద్ నిఘా విభాగం సీఐ గంగారెడ్డి, నిర్మల్ ఎస్సై జె.రాజు, సిబ్బంది నరేందర్, ఈశ్వర్, మధు, గౌతం, వెంకటేశ్, భాస్కర్, నిరోషా, తేజ ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు చేశారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... ముందస్తు సమాచారం మేరకు మండలంలోని మున్యాలతండా, ఎర్రగుంట, రేవోజీపేట గ్రామాల శివారుల్లో దాడులు చేసి గుడుంబా తయారుకు నిల్వ ఉంచిన 115 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

పరోక్షంగా బరిలో..

- ఎన్నికల్లో తప్పనిసరి నిలుస్తారని అనుకున్న మహిళా నేతలు
- అనివార్య కారణాలతో ఒకరు.. పార్టీ నిరాదరణకు గురై కొందరు
- టికెట్ రాకపోవడంతో కండువా మార్పు
- ఆయా అభ్యర్థుల గెలుపును సవాలుగా తీసుకొని కురుక్షేత్రంలో..
- ఆ నారీ నేతల రాజకీయంపై అందరి దృష్టి

జంగ్ తెలంగాణ



సాక్షి, ఆదిలాబాద్: ఆ మహిళా నేతలు ఆషామాషీగా రాజకీయాల్లో ఉన్నవారు కాదు.. సీరియస్‌గా పొలిటికల్‌లో కొనసాగుతున్న వారే. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి నియోజకవర్గాల్లో వాళ్ల పేరు బలంగా వినిపించిందే. అనివార్య కారణాలతో ఒకరు పోటీలో నిలవకపోగా, పార్టీ నిరాదరణకు గురై మిగతావారు ఈ ఎన్నికల్లో ప్రత్యక్ష పోరుకు దూరమయ్యారు. ఆ ఒక్కరు మినహా అందరు పార్టీ, కండువా మార్చి తామనుకున్న చోట అభ్యర్థిత్వం దక్కించుకున్న వ్యక్తికి వ్యతిరేకంగా ప్రత్యర్థి పార్టీలో చేరారు. ఇప్పుడు తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. టికెట్ దక్కలేదని వెనకడుగు వేయకుండా ఈ ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ విజయం సాధించాలని తలుస్తున్నారు. అభ్యర్థిగా కాకపోయినా పరోక్షంగా బరిలో నిలిచినట్లు భావిస్తూ సవాలుగా ముందుకు కదులుతున్నారు.

ఆసిఫాబాద్‌లో మర్సుకోల సరస్వతి..



ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో మర్సుకోల సరస్వతి ముందు నుంచి టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పీసీసీ సభ్యురాలిగా కొనసాగిన ఆమె ఈ ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కించుకుని బరిలో నిలుస్తానని ఎంతో ఆశగా ముందుకు కదిలారు. పార్టీ శ్యామ్‌నాయక్‌కు టికెట్ కేటాయించడంతో ఆమె కాంగ్రెస్‌ను వీడారు. తన సోదరి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా నిలిచారు. ఇటీవలే కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని ప్రస్తుతం అభ్యర్థితో కలిసి నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఆదిలాబాద్‌లో గండ్రత్ సుజాత..



ఆదిలాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్‌ను ఆశించిన గండ్రత్ సుజాత నిరాదరణకు గురయ్యారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ టిక్కెట్ కంది శ్రీనివాసరెడ్డికి దక్కడంతో అసమ్మతి నేతలు సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చారు. సంజీవ్‌రెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపిన అసమ్మతి వర్గం అతని గెలుపు కోసం విస్తృతంగా యత్నిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యే బరిలో నిలిచిన సుజాతకు పరాజయం ఎదురైంది. ఈ ఎన్నికల్లో టిక్కెట్ రాలేదని వెనుకడుగు వేయకుండా స్వతంత్ర అభ్యర్థిని రంగంలోకి దించి విజయం కోసం ముందుకు సాగుతున్నారు.

ముథోల్‌లో పడకంటి రమ..



నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా వ్యవహరించిన పడకంటి రమ ముథోల్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నుంచి పోటీ చేయాలని మరోసారి టికెట్‌ను ఆశించారు. గతంలో ఆమె రెండుసార్లు పోటీ చేసినప్పటికీ జయం వరించలేదు. ఈసారి రామారావుపటేల్‌కు టిక్కెట్ దక్కడంతో ఆమె పార్టీపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఇటీవలే కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకొని ప్రస్తుతం నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేపడుతున్నారు.

మంచిర్యాలలో సురేఖ..



ఆమె మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ. ఆ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు సతీమణి. జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల ఆదరాభిమానాలు పొందిన మహిళ నేత. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి ఇక్కడ బరిలో నిలుస్తారని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం ఆయన గెలుపు కోసం ఆమె రోజు ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు.

ఖానాపూర్‌లో రేఖానాయక్..



ఆమె రెండోమారు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మరోసారి బీఆర్‌ఎస్ పార్టీలో ఖానాపూర్ బరిలో నిలువాలని ఆశించారు.పార్టీ టికెట్ భుక్యా జాన్సన్ నాయక్‌కు దక్కడంతో ఆమె తిరుగుబావుటా ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేపడుతున్నారు.

ఒకే మండలం.. రెండు నియోజకవర్గాలు

- నర్సాపూర్(జి) మండలం ప్రత్యేకత..
- మహిళా ఓటర్లదే పైచేయి..



నర్సాపూర్(జి) మండల బోర్డు

నర్సాపూర్(జి): 2016 సంవత్సరంలో నిర్మల్ కొత్త జిల్లాగా ఏర్పడింది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ఆరు మండలాలు ఏర్పడగా అందులో నర్సాపూర్(జి) ఒకటి. ముథోల్ నియోజకవర్గం నుంచి ఎనిమిది గ్రామాలైన నందన్, బామిని(బి), చాక్‌పల్లి, అర్లి(కే), గొల్లమాడ, తిమ్మాపూర్(జి), బూర్గుపల్లి(జి), తురాటి, నిర్మల్ నియోజకవర్గం నుంచి ఐదు గ్రామాలైన నర్సాపూర్(జి), రాంపూర్, టెంబుర్ని, కుస్లీ, అంజనీతండాలను కలుపుకొని 13గ్రామాలతో నూతన మండలంగా నర్సాపూర్(జి) ఏర్పడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందిన విఠల్‌రెడ్డి, నిర్మల్ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. ఒక మండలం ఓటర్లు రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేయడం నర్సాపూర్(జి) మండలానికి ఉన్న ప్రత్యేకత. ఈసారి ఓటర్లు ఏ పార్టీ అభ్యర్థి వైపు మొగ్గుచూపుతారో డిసెంబర్ 3 వరకు వేచిచూడాల్సిందే.

నర్సాపూర్(జి) మండల వివరాలు...	
జనాభా	25,890
మహిళా ఓటర్లు	9870
పురుష ఓటర్లు	9385
మొత్తం ఓటర్లు	19255

'సోయం' కోసమే కాంగ్రెస్ కుట్రలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



అశోక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

తాంసి: బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు కోసమే కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. తాంసి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వన్నెల అశోక్, ఇతర నాయకులు జోగు రామన్న ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ డాక్టర్ అశోక్‌ను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మరో అభ్యర్థికి టికెట్ కేటాయించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఏజెంటుగా ఉన్న బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు కోసమే కుట్రలు చేస్తున్నారని ఆరోపించాడు. కాంగ్రెస్‌లోని రేవంత్‌రెడ్డి, బీజేపీలోని సోయం బాపూరావు సత్సంబధాలతోనే వన్నెల అశోక్‌కు టికెట్‌ను అడ్డుకున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలు గ్రహించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడాం నగేష్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోవర్ధన్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సభకు వెళ్లి.. గుండెపోటుతో ఒకరి మృతి



షేక్ అహ్మద్(ఫైల్)

లక్ష్మణచాంద: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు వెళ్లి ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన దూదేకుల షేక్ అహ్మద్ (62) వెళ్లాడు. నిర్మల్‌లో సభ ప్రారంభం కాకముందే ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పటంతో నాయకులు నల్ల రాజశేఖర్ రెడ్డి, కమల్‌కోట రాజారెడ్డిలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. డాక్టర్ స్వర్ణారెడ్డి ఉదార స్వభావంతో ఎలాంటి వైద్య ఖర్చులు తీసుకోలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన నల్ల రామక్రిష్ణ(37) బుధవారం అనుమానాస్పద స్థితిలో ఇంట్లో శవమై కనిపించాడు. పోలీసులు వివరాల ప్రకారం.. రామక్రిష్ణ కొంత కాలంగా ఒంటరిగా జీవిస్తున్నాడు. మద్యానికి సైతం అలవాటుపడ్డాడు. ఎప్పటిలాగా తల్లి నర్సవ్వ కుమారుడిని చూసేందుకు ఇంటికి రావడంతో తలపై గాయాలతో మృతిచెంది కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలనాకి చేరుకుని వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు. తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు శూన్యం



పోలీస్ సిబ్బంది పక్క నుంచి వెళ్తున్న వాహనం

బోథ్: ఎన్నికల వేళ డబ్బు, మద్యం రవాణాను అరికట్టాలని ఎన్నికల నిర్వహణ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఒకవైపు పేర్కొంటున్నా.... బోథ్ మండలంలోని ఘన్‌పూర్ చెక్ పోస్టు వద్ద మాత్రం తనిఖీ చేయడం లేదు. మహారాష్ట్ర నుండి బోథ్ మండలానికి వస్తున్న వాహనాలను తనిఖీలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి 9.30ల ప్రాంతంలో ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉండాల్సిన ఓ అధికారి లేకపోవడం, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేయకుండా వదిలేయడం, ఆపైన వీడియోగ్రాఫర్ పడుకుని ఉండటం చూస్తే తనిఖీలు ఏ విధంగా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఘన్‌పూర్ చెక్‌పోస్ట్‌ను సాక్షి పరిశీలించగా పైన పేర్కొన్న విధంగా కనిపించింది. తేరుకున్న వీడియోగ్రాఫర్ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి విధుల్లో ఉన్నానని, విధుల్లోకి రావాల్సిన మరో వ్యక్తి రాలేదని, అందుకే తాను పడుకున్నానని తెలిపాడు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

దహెగాం(సిర్పూర్): మండలంలోని ఇట్యాల గ్రామ సమీపంలో బుధవారం జరిపిన వాహనాల తనిఖీల్లో ఇరువురి వద్ద నుంచి రూ.2,66,500 నగదు పట్టుబడినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఇట్యాలకు చెందిన సాయికృష్ణ వద్ద రూ.2లక్షలు, కర్జి గ్రామానికి చెందిన పుల్గం మల్లేశ్ వద్ద రూ.66,500 నగదు లభ్యమైంది. ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

నస్పూర్(మంచిర్యాల): పట్టణ పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడినట్లు ఎస్సై రవికుమార తెలిపారు. పట్టణానికి చెందిన కుసుమల్ల స్వామినాథన్ బైక్‌పై రూ.7 లక్షల నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం



గంజాయి మొక్కలతో ఆబ్కారీ సిబ్బంది

గుడిహత్నూర్: రూ.12లక్షల విలువ చేసే గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఆబ్కారీ శాఖ సీఐ రాజమౌళి తెలిపారు. సమాచారం మేరకు మండల కేంద్రంలోని లక్ష్మీ దాబా వెనుక ఉన్న లాందాడే మోహన్‌కు చెందిన పత్తి చేనులో 120గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.12లక్షలు ఉంటుందని చెప్పారు. లాందాడే మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో స్క్వాడ్ సీఐ లక్ష్మణ్‌రావ్, ఎస్సై సీహెచ్ లక్ష్మణ్‌కుమార్ ఉన్నారు.

ఒకరి హత్య



బండు(ఫైల్)

బేల: మండలంలోని కరోని(బి) రెవెన్యూ గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద అదే గ్రామానికి చెందిన మేస్త్రి పనిచేసే తొడసం బండు(35) మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కరోని(బి) గ్రామం నుంచి తొడసం బండు బేలకు బైక్‌పై వచ్చాడు. రాత్రి ఇంటికి తిరిగి వెళ్లలేదు. అర్ధరాత్రి క్రమంలో గ్రామానికి వెళ్లిన పలువురు వంతెనపై రక్తం ఉండడం, వాగులో తొడసం బండు పడి ఉండాన్ని చూసి అతడి తమ్ముడు తొడసం దొబికి విషయాన్ని చెప్పారు. వెంటనే గ్రామస్తులతో కలిసి వచ్చి చూసేసరికి బండు గొంతును కోసి హత్య చేసినట్లు గుర్తించారు. మృతుడికి భార్య జమున, ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. బుధవారం జైనథ్ సర్కిల్ సీఐ కోల నరేష్‌కుమార్, ఎస్సై రాధికలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచార రథాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం పోలీసుస్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో పత్రి కైలాస్, అలాగే కేఆర్‌కే కాలనీలో షేక్ సిరాజ్‌లు అధిక సౌండ్‌తో ప్రచారం చేపట్టడంతో వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేపు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న మంచిర్యాల బ్యాడ్మింటన్ అకాడమిలో 14 ఏళ్ల బాలబాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిళ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని, సంబంధిత ధ్రువపత్రాలు వెంటతెచ్చుకోవాలని సూచించారు.

'బాణీ' అదే...'వాణి' వేరే..!

- అన్ని పార్టీల ప్రచారంలో మార్మోగుతున్న 'రామక్క పాట'



నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. ఈ క్రమంలో అందరి దృష్టిని మాత్రం ఓ పాట ఆకర్షిస్తోంది. అన్ని పార్టీల వారికీ అదేపాట అక్కెరకొస్తోంది. ఆ పాట పల్లవి మాత్రం ఒక్కటే. కానీ సరిగ్గా వింటే అందులో ఉన్న పదాలు మాత్రం ఆయా పార్టీలకు చెందినవిగా ఉంటాయి.. ‌్ఞనడువు నడువు నడవవే రామక్క... కలిసి నడుము కట్టవే రామక్క....!‌్ఙ అంటూ హోరెత్తుతున్న ఈ పాటను మొదట గులాబీ పార్టీ బీఆర్‌ఎస్ రూపొందించింది. అయితే ఈ పాట జనంలోకి బాగా కనెక్ట్ కావడంతో ఇదే పల్లవి, ఇదే బాణీతో హస్తం పార్టీ, కమలం పార్టీలు కూడా ఆ చరణాలను మార్చి ఆ పాటకు తమ పార్టీలకు అనుగుణంగా పదాలను కూర్చి సరికొత్తగా పాటల్ని రూపొందించాయి. ఎన్నికల సమయం కావడంతో అన్ని పార్టీల ప్రచార రథాలలోని మైకుల్లో ఈ పాటలు మోత మోగిస్తున్నాయి. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో పార్టీల వారీగా దరువులు కొనసాగుతుండగా ఇక ఈ ‌్ఞరామక్క పాట‌్ఙ వీధి వీధిలో మార్మోగిపోతోంది. ఎన్నికల ప్రచార సమయం కావడంతో ఈ పాట వినిపించగానే జాగ్రత్తగా వింటున్నారు. ఈ పాట ఏ పార్టీకి చెందినదో గుర్తిస్తున్నారు. ఆయా పార్టీల వారు కూడా తమ ప్రచార రథంలో తమ పార్టీకి బదులు ఎదుటి పార్టీ పాటను పెట్టే అవకాశం ఉండడంతో జాగ్రత్త వహిస్తున్నారు. ఆయా పార్టీలకు చెందిన హామీలు, పథకాలు, అభ్యర్థుల గుణగణాలను వర్ణిస్తూ ఇదే పల్లవితో కూడిన పాట అదే బాణీలో ప్రచారంలో అన్ని పార్టీలకు మార్మోగిపోతుండడం గమనార్హం. ఇక కొంత మంది నాయకులు అన్ని పార్టీలకు తమ గాత్రాన్ని అందిస్తుండడంతో పాటను జాగ్రత్తగా వింటే గాని ఏ పార్టీకి చెందినదో తెల్సుకోలేక పోతున్నారు. శ్రోతలైన ఓటర్లు ఇక ఆయా పార్టీల నాయకులు తమ ప్రచారం కోసం లేదా పార్టీ బహిరంగ సభలు, మీటింగ్‌ల కోసం కూలీ లెక్కన జనాన్ని తరలిస్తుండడంతో ఒకరోజు ఈ పార్టీ కండువా వేసుకొని స్టెప్పులు ఇస్తే.. మరోరోజు మరోపార్టీ పాటకి డ్యాన్సులు వేస్తున్నారు. ఇక కూలీ కూడా అధికంగా ఉండడంతో పాటు భోజన సదుపాయం కూడా ఆయా రాజకీయ పార్టీల నాయకులు అందిస్తున్నారు. సభలు, సమావేశాలు, బహిరంగ సభలకు వెళ్లే దినసరి కూలీల వారికి ఇది ఉపాధి అవకాశంగా మారిందని అంటున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య



చాకెటి భోజన్న(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చాకెటి భోజన్న(35) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... చాకెటి భోజన్న బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి నష్టపోయాడు. రెండేళ్ల క్రితం స్వగ్రామానికి చేరుకుని ఇంటిని నిర్మించుకున్నాడు. దీంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడ ంతో కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం సాయంత్రం పంట పొలానికి నీటిని పట్టించేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పంట పొలంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

మద్యానికి బానిసై యువకుడి మృతి



సాయినాథ్ (ఫైల్)

తానూరు: మద్యం మత్తులో పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం... ఉమ్రి(కె) గ్రామానికి చెందిన దేశ్‌ట్టివార్ సాయినాథ్(30) నాలుగేళ్ల నుంచి మద్యానికి బానిసైయ్యాడు. మద్యం తాగొద్దని కుటుంబీకులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సాయినాథ్ తన వ్యవసాయ పొలానికి వెళ్లి పరుగుల మందు తాగి రాత్రి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో కనిపించాడు. వెంటనే ఆటోలో చికిత్స నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉరేసుకుని వృద్ధురాలు..



ఎల్లవ్వ మృతదేహం

ముథోల్: అనారోగ్యంతో వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన సంగి ఎల్లవ్వ(65) ఎల్లవ్వ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుమారుడు సంగి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగదేవత ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో బుధవారం నాగదేవత ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, నిమ్మగడ్డ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా విగ్రహానికి అభిషేకాలు, జలాధివాసం, ధాన్యాదివాసం, ప్రాణప్రతిష్ఠ హవనం, విగ్రహ స్థాపన, యజ్ఞం, పూర్ణాహుతితో పాటు అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజన్న ఉన్నారు.